క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి

నెహ్రూనగర్: బడి బయట ఉన్న బాలలను బడిలో ఉండే విధంగా చూడటంతో పాటు, బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని 21వ డివిజన్ కార్పొరేటర్ కె.గురవయ్య తెలిపారు. మంగళవారం కొండా వెంకటప్పయ్య కాలనీలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నియంత్రణ, వార్డు బాల్య వివాహాల నిరోధక కమిటీ నిరంతరం పర్యవేక్షించాలని అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీడీపీఓ కృష్ణవేణి మాట్లాడుతూ వివాహం చేయాలంటే అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ జీ వెంకట్ పాల్గొన్నారు.

రేపు వ్యాస రచన పోటీలు

నెహ్రూనగర్: స్వచ్ఛతా హి సేవ – 2024లో భాగంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు స్వచ్ఛ గుంటూరు సాధనలో విద్యార్థులను భాగస్వాములను చేయనున్నట్లు చెప్పారు. డ్రాయింగ్ (కాలుష్య రహిత నగరం), వ్యాసరచన (కాలుష్య రహిత నగరం), నినాదాలు (పర్యావరణ పరిరక్షణ)పై నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ముందుగా పాఠశాల పరిధిలో పోటీలు నిర్వహించుకుని, ఈ నెల 26 ఉదయం 10:30 గంటలకు బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరిగే నగర స్థాయి పోటీలకు పంపించాలని కోరారు. వివరాలకు పోటీల నోడల్ అధికారి డి.తిరుపతిరెడ్డి (94934 43342)ని సంప్రదించాలని కోరారు.

ఎంఎస్ఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏఎన్‌యూ: ఎంఎస్ఎఫ్(మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్) ఏఎన్‌యూ శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సురేష్ తెలిపారు. అధ్యక్షుడిగా కె.ప్రఫుల్, ఉపాధ్యక్షుడిగా అఖిల్, కార్యదర్శిగా ఆనంద్, సంయుక్త కార్యదర్శిగా కోటి, కోశాధికారిగా షాలేమ్, ఆర్ట్స్ కన్వీనర్‌గా బద్రి, సైన్స్ కన్వీనర్‌గా నవీన్, బీటెక్ కన్వీనర్‌గా సంజు, డే స్కాలర్ కన్వీనర్‌గా తేజ, శామ్యూల్, ప్రెస్ రిలేషన్స్ ఇన్‌చార్జిగా వృద్ధి ఎన్నికయ్యారన్నారు. నూతన కార్యవర్గ నాయకులు మంగళవారం యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ పరిశోధక సంఘ నాయకులు వై.రాజేష్, ఎన్.శాస్త్రి, సునీల్, చంద్రబాబు, కుటుంబరావు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డ్స్‌కు జీతాలు సక్రమంగా చెల్లించాలని వినతి

నెహ్రూనగర్: గాంధీ పార్కులో సెక్యూరిటీ గార్డ్స్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఏజెన్సీ నిర్వాహకులు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ అండ్ శానిటేషన్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మద్దిరాల ఇమ్మానుయేల్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదుల మూడి మధుబాబు, ఎస్సీ వెల్ఫేర్ సెక్రటరీ జనరల్ మేడిద బాబూరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు తప్పని తిప్పలు

నెహ్రూ నగర్: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెల సరఫరా చేసే కందిపప్పు కాంట్రాక్టర్లు ప్రతి సెంటర్‌కి వెళ్లి అందజేయాల్సి ఉంటుంది. కానీ ఐసీడీఎస్ అధికారులు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఒక సెంటర్‌లోనే పౌష్టికాహారం దింపుతున్నట్లు... అక్కడి నుంచి వారి వారి అంగన్‌వాడీ కేంద్రాలకు స్వయంగా ఖర్చు పెట్టుకుని తీసుకెళ్లాలని ఐసీడీఎస్ అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈస్ట్ 1 సెక్టార్‌కు సంబంధించిన 28 సెంటర్లకు మొత్తానికి కలిపి మంగళవారం మణిపురం సెంటర్ లోని అంగన్‌వాడీ కేంద్రంలో దింపారు. దీంతో చేసేదేమీ లేక అంగన్‌వాడీ టీచర్లు మణిపురం సెంటర్ నుంచి దూర ప్రాంతాలైన సెంటర్లకు సొంత ఖర్చులతో ఆటోలు ఏర్పాటు చేసుకొని పౌష్టికాహారాన్ని తీసుకెళ్లారు.

ఔషధ దుష్ప్రభావాలపై ఫార్మకో విజిలెన్స్‌కు ప్రాధాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: ఔషధ వినియోగం, దుష్ప్రభావాలపై ఫార్మకోవిజిలెన్స్ ప్రాముఖ్యాన్ని గుర్తించాలని ఒంగోలు రిమ్స్ కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ చంద్రకళ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఔషధ వినియోగం ద్వారా కలిగే దుష్ప్రభావాలపై నిఘా వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్సు ప్రాముఖ్యత, దాని వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలు, ఔషధాలతో వాటిల్లే దుష్ప్రభావాలను పవర్ పాయింట్ ప్రాజంటేషన్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఎన్.హేమకుమారి పాల్గొని డాక్టర్ చంద్రకళను సత్కరించారు.

ఊపిరి కష్టమైతే నష్టమే..

- పెరుగుతున్న ఊపిరితిత్తుల బాధితులు
- నేడు వరల్డ్ లంగ్ డే



గుంటూరు మెడికల్: మనిషి శ్వాస తీసుకుంటేనే ప్రాణాలతో ఉంటాడు. శ్వాస తీసుకునేందుకు ఊపిరితిత్తులు ఎంతో కీలకం. ఒక్కరోజులో దాదాపు 25వేల సార్లు ఊపిరి తీసుకుంటాడు. ఆక్సిజన్‌ను శరీరం అంతా పంపిణీ చేస్తాయి. ఆధునిక జీవన శైలి వలన సమస్యలు ఉత్పన్నమై ఊపిరి తీసుకోవడం కష్టమై పోయి కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబరు 25న వరల్డ్ లంగ్ డే నిర్వహిస్తున్నారు.

బాధితులు అధికమే...

గుంటూరు జిల్లాల్లో 50 మంది పల్మనాలజిస్టులు(ఊపిరితిత్తుల స్పెషాలిటీ వైద్య నిపుణులు) సేవలందిస్తున్నారు. ఒక్కో డాక్టర్ వద్దకు ప్రతిరోజూ 30 నుంచి 50 మంది ఊపిరితిత్తుల సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. కరోనా సమయంలో ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స చేసే పల్మనాలజిస్ట్‌ల పాత్ర బాగా పెరిగింది. కోవిడ్–19 వచ్చి కోలుకున్న పిదప తిరిగి కొంత మందికి పోస్ట్‌కోవిడ్ కాంప్లికేషన్స్ వస్తున్నాయి. ఇలాంటి వారికి పల్మనాలజిస్టులు సకాలంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు రక్షిస్తున్నారు.

ఊపిరితిత్తులకు వచ్చే జబ్బులు....

ఊపిరితిత్తులకు వచ్చే వ్యాధుల్లో ఆస్తమా, సీవోపీడీ, లంగ్ క్యాన్సర్, టీబీ, చాలా ముఖ్యమైనవి. ఎక్కువ శాతం మరణాలకు పైన పేర్కొన్న వ్యాధులే కారణం. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఏడు లక్షల మంది పిల్లలు ఊపిరితిత్తులకు వచ్చే నియోనియా వ్యాధితో చనిపోతున్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులు గుర్తించడం ఎలా?

ఎక్కువగా దగ్గు, ఆయాసం, పిల్లికూతలు, ఛాతి పట్టివేయడం లాంటి లక్షణాలు కనిపిస్తే అది సీఓపీడీ వ్యాధిగా గుర్తించాలి. తరచుగా జలుబు చేయడం, వళ్లు దురద, కళ్లు మంటలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు, సరిపడకపోవడం లక్షణాలను ఎలర్జీగా గుర్తించాలి. జ్వరం, కళ్లేతో కూడిన దగ్గు, శ్వాస తీసుకునేటప్పుడు ఛాతి నొప్పి ఉంటే దానిని నిమోనియా వ్యాధిగా భావించాలి. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, వంటి లక్షణాలు కనిపిస్తే ఊపిరితిత్తులకు వచ్చే క్షయ వ్యాధిగా గుర్తించాలి. దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లంగ్ క్యాన్సర్ లక్షణాలు. పొడి దగ్గు, ఆయాసం, కీళ్ళ నొప్పులు ఉంటే ఊపిరితిత్తులకు వచ్చే ఐఎల్‌డీ వ్యాధిగా గుర్తించాలి.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



క్రమం తప్పకుండా ఇన్‌ఫ్లూయెంజా, నీమోకోకల్ వ్యాక్సిన్లు వేయించుకోవడం వల్ల జలుబు, నిమోనియా లాంటి ఊపిరితిత్తుల జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. పిల్లలకు తప్పనిసరిగా అన్ని రకాల వ్యాక్సిన్లు వేయించాలి. గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీ, పొగతాగడం, విడనాడాలి. దుమ్ము, ధూళి లాంటి ప్రదేశాల్లో మాస్క్ ధరించడం ఉత్తమం. మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉండాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముఖానికి కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి.

డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు.

ఉచిత వైద్య సేవలు



గుంటూరులోని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల హాస్పిటల్‌లో ప్రతిరోజూ 170 మంది వరకు ఊపిరితిత్తుల సమస్యల బాధితులు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నాం. పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం, ప్రాణాయామం, చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

– డాక్టర్ శ్రీకంటి రఘు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి, గుంటూరు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు



దగ్గరుండి మురుగును తొలగింపజేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు తమ పరిధిలోని ప్రాంతాల్లో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం సగర కాలనీ, రామిరెడ్డి తోట, ఓల్డ్ క్లబ్ రోడ్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలను సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తొలుత సగర కాలనీలోని పలు వీధులను పరిశీలించి, స్థానికులను సమస్యల గూర్చి అడిగి తెలుసుకొని, వర్షాలకు నీరు నిల్వకుండా ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సదరు ప్రాంతంలో మెయిన్ రోడ్‌కి చాలా లోతట్టుగా ఉన్నందున లెవల్స్ సేకరించాలన్నారు. అనంతరం రామిరెడ్డి తోట మొదటి లైన్‌ని పరిశీలించి, వర్షం వలన డ్రెయిన్‌లోకి వెళ్లాల్సిన నీరు వెళ్లకుండా రోడ్ల మీదకు రావడం, బురద ఉండడం గమనించి సంబంధిత ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల మీద ఉన్న బురదను దగ్గర ఉండి కార్మికులతో శుభ్రం చేయించారు. పర్యటనలోకార్పొరేటర్ ఎం.శ్రీవల్లి, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఏసీపీ అజయ్ కుమార్, ఎంహెచ్‌ఓలు రామారావు, ఆనంద కుమార్, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, డీఈఈ రాము పాల్గొన్నారు.

అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి కృషి

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థంభాలగరువు మెయిన్ రోడ్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవితో కలసి నిర్వహించారు.

బోధన పద్ధతులను మెరుగుపర్చాలి

- ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో బోధన పద్ధతులను మెరుగుపర్చాలని పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలోని జలగం రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఐఎఫ్‌పీల ద్వారా అందిస్తున్న విద్యాబోధన తీరు, తెన్నులను పరిశీలించారు. ఐఎఫ్‌పీలపై వివిధ అంశాలను వివరిస్తూ విద్యార్థులకు వివిధ ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. ఈసందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో ఆధునిక విద్యాబోధన అందించడంలో ప్రధానోపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు కాలానుగుణంగా బోధన పద్ధతులను మెరుగు పరచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అభివృద్ధి పర్చేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని అన్నారు.

ఇన్సులిన్‌తో పనిలేకుండా షుగర్ కట్టడి సాధ్యమే

- ఎండ్రోకైనాలజిస్ట్ డాక్టర్ వెంకటసందీప్

గుంటూరు మెడికల్: షుగర్ వ్యాధిని ఇన్సులిన్‌తో పనిలేకుండా మందులతోనే కట్టడి చేయడం సాధ్యమని ఎండ్రోకైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకటసందీప్ పేర్కొన్నారు. కొత్తపేట ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ఏలూరి ఆర్థోకేర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయవెల్లూరు సీఎంసీ హాస్పటల్‌లో పలువురు వ్యాధి బాధితులపై పరిశోధన చేసి, ఇన్సులిన్‌తో పనిలేకుండా మందుల ద్వారా మధుమేహాన్ని నియంత్రించినట్లు వివరించారు. మందులు వాడుతున్న వారికి మందులతో పనిలేకుండా కేవలం ఆహారంలో జీవన శైలిలో మార్పుల ద్వారా వ్యాధిని నియంత్రణలో పెట్టామన్నారు. ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, ఆర్థోస్కోపి డాక్టర్ ఏలూరి రామకృష్ణ మాట్లాడతూ పదేళ్లుగా గుంటూరు నగరంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన ఇచెప్పారు. నేడు ప్రత్యేకంగా ఎండ్రోకైనాలజీ వైద్య సేవలు తమ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. క్రిటికల్ కేర్ స్పెషలిటస్టు డాక్టర్ మానస మాట్లాడుతూ తమ హాస్పిటల్‌ల అన్నిరకాల వైద్య సేవలు 24 గంటలూ అందుబాటుల ఉంటాయన్నారు. సమావేశంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాగదీపిక పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐలు అశోక్, సింగయ్య

పట్నంబజారు: ఆటో డ్రైవర్లు కచ్చితంగా నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ సూచించారు. ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్‌లో మంగళవారం ఆటోడ్రైవర్లతో సమావేశం ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఏ అశోక్‌తో కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ రికార్డులను ఉంచుకోవాలని తెలిపారు. కచ్చితంగా ప్రతి ఆటోకు పోలీసు నెంబర్ ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆటో నడిపే ప్రతి ఒక్కరికి అనుమతి ఉండాలన్నారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, పూలమార్కెట్, పల్నాడు బస్టాండ్ ప్రాంతాల్లో ఆటోలు రోడ్లుపై నిలిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కల్పించిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన సహించబోమని పేర్కొన్నారు. అదే విధంగా ఎవరైనా అనుమానితులు ఆటోల్లో ఎక్కితే వారి సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య పాల్గొన్నారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం



జ్యోతిరావ్‌పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏఎన్‌యూ: సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని మహాత్మా జ్యోతిరావు పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే దంపతుల చిత్రపటాలకు రిజిస్ట్రార్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ సీహెచ్ స్వరూపరాణి, కె.వీరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పూలే అధ్యయన కేంద్రం సంచాలకులు ఎం.త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతుల త్యాగాలు మరువలేనివన్నారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.ప్రమీలరాణి, పూలే అధ్యయన కేంద్రం ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్, బి.సి. ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఐ.సాయిరామ్, ఎన్.శ్రీనివాసరావు, నీలకంటేశ్వర రావు, ఢిల్లీశ్వరరావు, బీసీ ఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో స్వచ్ఛతా హి సేవ





గుంటూరు జీజీహెచ్ పరిధిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గుంటూరు రైల్వేస్టేషన్ రోడ్డులో జీజీహెచ్ ప్రహరీపై ప్రకటన బోర్డులు తీసివేయించారు. మెయిన్ గేటు గోడకు ప్రకటన రాతలు ఉంటే వాటిని తెల్ల పెయింటింగ్ వేశారు. ప్రహరీకి ఆనుకొని ఉన్న టిఫిన్ బండ్లు, చెప్పులు బండ్లు, పరిసరాలు మూత్రవిసర్జన చేయడం వల్ల అపరిశుభ్రంగా ఉండటంతో వారిని అక్కడ నుంచి తీసివేయాలని డాక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

నాయీబ్రాహ్మణ క్షౌర వృత్తికి పేటెంట్ హక్కు కల్పించాలి

నెహ్రూనగర్: నాయీబ్రాహ్మణ క్షౌర వృత్తికి పేటెంట్ హక్కు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతగుంటూరులో నాయీబ్రాహ్మణులు కాకుండా వేరే వ్యక్తులు సెలూన్ ఏర్పాటు చేయడంపై క్షౌర వృత్తి దారులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నాయీబ్రాహ్మణ క్షవర వృత్తిదారులకు పేటెంట్ హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బత్తేశ్వరరావు, నాగులవంచ రవీంద్ర, ఈతులసీరామ్, ఎన్.రాంబాబు, మార్దురీ రాఘవ, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర జూడో విజేతలను అభినందించిన డీఈఓ శైలజ



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో శైలజ, ఎస్జీఎఫ్ కార్యదర్శి రవి

గుంటూరు ఎడ్యుకేషన్: అండర్–14 జూడో రాష్ట్ర స్థాయి మీట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అభినందించారు. గుంటూరులోని డీఈవో కార్యాలయంలో మంగళవారం అభినందించారు. తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 22,23వ తేదీల్లో జరిగిన పోటీల్లో గుంటూరు రూరల్ మండలం అడవితక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి ఎం.వినోద్‌కుమార్ 45 కేజీల విభాగంలో బంగారు పతకం, 25 కేజీల విభాగంలో కె.జాషువా కాంస్య పతకాలను సాధించారు. చిలకలూరిపేటలోని ఏఎంజీ హైస్కూల్ విద్యార్థిని వై.అమూల్య 50 కేజీల విభాగంలో రజత పతకం సాధించారు. కోచ్, మేనేజర్లుగా వ్యవహరించిన నాగదుర్గ, ఆనంద్‌కుమార్‌ను డీఈవో శైలజ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవి, పీడీలు బి.రమేష్, సీహెచ్ వినయ్‌కుమార్ అభినందించారు.

సంక్షిప్త వార్తలు

రేపు అక్కినేని ఆత్మీయ పురస్కారం ప్రదానం

నగరంపాలెం: అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా కళావిపంచి(హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమి(గుంటూరు) సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ హాస్య దర్శకులు రేలంగి నరసింహారావుకు అక్కినేని ఆత్మీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

అక్కినేనికి ఘన నివాళి

లక్ష్మీపురం: భారతీయ చిత్ర పరిశ్రమలో ఒక శిఖరం లాంటి నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ సినీ రంగ విశ్లేషకులు అమరాచారి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సభ నిర్వహించారు. తొలుత అక్కినేని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడారు.

నగరపాలక సంస్థ ఎస్ఈగా నాగమల్లేశ్వరరావు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా కె.నాగమల్లేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న ఎం.శ్యాంసుందర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎస్ఈగా పనిచేస్తున్న నాగమల్లేశ్వరరావును ఇక్కడకు బదిలీ చేశారు.

ఈఈలు బదిలీ..

ఇంజినీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వి.కొండారెడ్డిని ఏపీ టిడ్కో క్వాలిటీ కంట్రోల్ ఈఈగా నెల్లూరుగా బదిలీ చేశారు. జే శ్రీనివాస్‌ను నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఈఈగా బదిలీ చేశారు. వీరితోపాటు డీఈలు, ఏఈలు కూడా బదిలీపై వెళ్లారు.

పట్టణ ప్రణాళిక విభాగంలోను...

నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలోను చాలా మంది ఉద్యోగులకు స్థాన చలనం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న వారిని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేసింది.

ప్రతిభ చూపిన ఏసీ కళాశాల విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల విద్యార్థి పరదేశి నాని ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ తరఫున ఢిల్లీలో జరిగిన తల్‌సైనిక్ క్యాంపులో పాల్గొని ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 33 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్న శిబిరానికి కళాశాల తరఫున హాజరైన పరదేశి నానిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కేఎఫ్ పరదేశి బాబు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ బి.వి జయకుమార్, డాక్టర్ జీఏ ప్రీతం ప్రకాష్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పీఎం వినయ్‌తేజ, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఎజ్రా విజయశేఖర్, సాగర్, కె.రవి పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో స్వచ్ఛతా హి సేవ

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల క్యాంపస్‌లోని ఇగ్నో అధ్యయన కేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇగ్నో ప్రాంతీయ డైరెక్టర్లు డాక్టర్ డీఆర్ శర్మ, డాక్టర్ మమత, డాక్టర్ బాల చందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ఇగ్నో అధ్యయన కేంద్ర ఎ.భానుమురళీధర్, ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కొరిటెపాడు(గుంటూరు): సంగడిగుంటలోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు గుంటూరు టౌన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు టి.శ్రీనివాస్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలు, గుంటూరు రూరల్, పెదకాకాని మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేసు విషయంలో రాజీకి రావాలని భార్యపై దాడి

లక్ష్మీపురం: గతంలో పెట్టిన కేసుల విషయంలో రాజీకి రావాలని భార్యపై దాడి చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. హనుమాన్ నగర్ ప్రాంతానికి చెందిన జెట్టబోయిన వెంకటరమణ, అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నారు. వీరికి ఒక సంతానం ఉన్నారు. అయితే వెంకటేశ్వర్లుకు అంతకు ముందే లక్ష్మితో వివాహం అయి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో భార్య వెంకటరమణను వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆమె దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఇంటిలో సామన్లు ఎత్తుకెళ్లడంతో మరో కేసు నమోదు చేశారు. ఆ రెండు కేసులు రాజీ చేసుకునేందుకు రావాలని భార్య వెంకటరమణపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన వెంకటరమణను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరక పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్లుడిపై మామ..

లాలుపురం గ్రామానికి చెందిన పి.శ్రీకాంత్ ఆర్మీ ఉద్యోగి. కొంతకాలం నుంచి భార్యతో గొడవపడి కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. మంగళవారం ఆర్మీ క్యాంటిన్ నుంచి వెళ్తున్న శ్రీకాంత్‌పై మామ పెద్దమల్లు రాంబాబు కర్రతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఫిర్యాదు చేయగా, పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరువ్యాపారులు..

కొబ్బరి బొండాల బండి కంటే, పూల బండి ముందు పెట్టాడనే విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ మంగళవారం జరిగింది. అడవి తక్కెళ్లపాడుకు చెందిన కె.శివనాగరాజు వెల్‌కమ్ హోటల్ వద్ద కొబ్బరిబొండాల వ్యాపారం చేసుకుంటున్నాడు. అదే ప్రాంతంలో కె.రమేష్, నాగూర్‌బి పూలు, పండ్లు వ్యాపారం చేసుకుంటున్నారు. బండిని వెనక్కు జరపాలని శివనాగరాజు కోరగా, రమేష్, నాగూర్‌బి అతనిపై దాడిచేశారు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొంది, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యున్నతమైన కావ్యం క్రీస్తు చరిత్ర

నగరంపాలెం: మహాకవి గుర్రం జాషువా రచనలోకెల్లా క్రీస్తు చరిత్ర కావ్యం అత్యున్నతమైనదని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాల్లో భాగంగా జాషువా కళా పీఠం ఆధ్వర్యంలో ఏసీ కళాశాల జేడీ శీలం హాల్‌లో మంగళవారం క్రీస్తు చరిత్ర కావ్యంపై సభ నిర్వహించారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మలపాటి మోజెస్ అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి డొక్కా మాట్లాడుతూ ఏ ఇతిహాసం, పురాణాన్నైనా పద్యంగా మలచవచ్చు గానీ బైబిల్‌ను పద్య ప్రక్రియలోకి తీసుకురావడం సులభ సాధ్యం కాదన్నారు. అయితే బైబిల్‌ను కూడా పద్యంలోకి తీసుకొచ్చిన ఘనత జాషువాకే దక్కుతుందని అన్నారు. ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మాధ్యూభాస్కర్ మాట్లాడుతూ జాషువా కవి నిరుపేద కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాలను అధిరోహించాడని అన్నారు.

బీహెచ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నేచురోపతి సభ్యురాలు బొల్లాప్రగడ శ్రీదేవి విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బీవీ విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. కొసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఏ, రాధామాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్‌ఎల్ దీప్తి, ఎం.గిరిజ పాల్గొన్నారు.

చదువుతో పాటు సామాజిక సేవకు నడుం బిగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవకు నడుం బిగించాలని గుంటూరు చలమయ్య– కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీధర్ సంస్థ ఉద్దేశం వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జి సుభద్ర పాల్గొన్నారు.